ప్రజాశక్తి
ఆదివారం 2 మార్చి 2025 | 5 | అనంతపురం

పరీక్ష కేంద్రం వద్ద నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

నేరాల నియంత్రణే లక్ష్యం

- శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ కృషి ఎనలేనిది
- సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి
- ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్‌లో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత

ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్‌లో మాట్లాడుతున్న మంత్రి అనిత

పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి అనిత

ప్రతిభ కనబరిచిన శిక్షణ ఎస్‌కు బహుమతి అందిస్తున్న మంత్రి

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

రాష్ట్రంలో ప్రజలకు రక్షణగా నిలుస్తూ, నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసు సిబ్బంది విధులు నిర్వహించాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న 394 ఎస్‌సిటి ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హోం మంత్రితో పాటు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హోం మంత్రి మాట్లాడుతూ 394 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లు శిక్షణను పూర్తి చేసుకుని విధుల్లోకి వెళ్తుండడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో 97 మంది మహిళా అభ్యర్థులుండడం హర్షనీయం అన్నారు. పోలీసు ఉద్యోగం మిగతా ఉద్యోగాల వంటిది కాదని, ఇందులో 24 గంటలూ విధుల్లో ఉండాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. నిజాయితీ, నిష్పక్షపాతం, బాధితులపై సానుభూతి, విధిపట్ల నిబద్ధత పోలీసు ఉద్యోగంలో తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించి, నేరాలను కట్టుదిట్టంగా అరికట్టడానికి, చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయడానికి సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం వుందన్నారు. బాధితులకు న్యాయం చేయడం ద్వారా పోలీసు వ్యవస్థపై ప్రజలకు భరోసా కలుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందింపుచ్చుకుని దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. సైబర్ ల్యాబ్‌లను మరింత బలోపేతం చేయడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందని, ఇందులో పోలీసులు ప్రముఖపాత్ర పోషించి గంజాయి, డ్రగ్స్‌పై సదస్సులు పెట్టి ప్రజల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు.

నిష్పక్షపాతంగా పని చేయాలి : డిజిపి

విధుల్లో చేరే సమయంలో చేసిన ప్రతిజ్ఞలో నిష్పక్షపాతంగా, నిర్భయంగా రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తామని ప్రమాణం చేశారని వీటిని ఉద్యోగ విరమణ పొందే వరకు మరువకూడదని డిజిపి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. మానవ హక్కులను కాపాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. సైబర్ నేరాల కట్టడికి ప్రతి జిల్లాలోనూ సైబర్ స్టేషన్ ఏర్పాటుకు కృషి జరుగుతోందన్నారు. మహిళలు, చిన్నారులు, అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి రాష్ట్ర పోలీసు శాఖ గట్టి చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్ డోర్ విభాగాల్లో రాణించిన, ప్రతిభ కనపరిచిన శిక్షణార్థులకు హోంశాఖామంత్రి చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎమ్మెస్ రాజు, పల్లె సింధూర రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిక్షణ విభాగం ఐజిపి కెవి.మోహన్ రావు, ఏపీఎస్పీ బెటాలియన్స్ విభాగం ఐజిపి రాజకుమారి, కర్నూలు డిఐజి కోయ ప్రవీణ్, ఎస్పీ పి.జగదీష్, వి.రత్న, రాధిక, మీనా, తాడిపత్రి ఎఎస్పీ రోహిత్ కుమార్ చౌదరితో పాటు ఉమ్మడి జిల్లాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కనిపించిన నెలవంక

- నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం
- ముస్తాబైన మసీదులు

ప్రజాశక్తి - హిందూపురం

ముస్లిములు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభమైంది. శనివారం నెలవంక కనిపించగా, ఆదివారం నుంచి ఉపవాసాలు ప్రారంభంకానున్నాయి. రంజాన్ నెల ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదులను ప్రత్యేక విద్యుత్ దీపాల అలంకరణలతో ముస్తాబు చేశారు. ముస్లింలు 30 రోజులు ఉపవాస దీక్షలు(రోజా) పాటిస్తారు. ఉపవాస దీక్షలో భాగంగా అల్లాహ్ స్మరణ చేస్తూ తనకు తాను అంతర్గతంగా ఆత్మ ప్రక్షాళన చేసుకుంటారు. సూర్యోదయం కంటే ముందే నిర్దేశిత సమయంలో అన్నపానీయాలు తీసుకుంటారు. దీనినే సహర్ అంటారు. ప్రతి రోజూ కొన్ని నిమిషాల తేడాతో సూర్యాస్తమయంలో ఉపవాసదీక్ష విరమించడమే ఇఫ్తార్. ఇఫ్తార్‌ను ఖర్జూరా, ఇతరత్రా ఫలాలతో విరమిస్తారు.

చంద్రబాబు మోసపూరిత బడ్జెట్

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ చంద్రబాబు మోసపూరితనానికి నిదర్శనమని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ సహా 143 హామీలను గాలికి వదిలేశారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 'బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ' అన్న రీతిలో బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. 'కూటమి ప్రభుత్వం కాదు.. కోతల ప్రభుత్వం' అని స్పష్టం అవుతుందన్నారు. వృద్ధాప్య పింఛన్లు, తల్లికివందనం పథకాల్లో భారీ కోత విధించారన్నారు. మహిళలకు నెలకు రూ.1500 అని చెప్పి బడ్జెట్‌లో ఎందుకు ఎందుకు కేటాయించలేదని మండిపడ్డారు. ఇక అన్నదాత సుఖీభవ కింద 20 వేలు ఇస్తామని కేవలం రూ.6వేల కోట్లే ఎందుకు కేటాయించారన్నారు. ఇక మహిళలకు ఉచిత బస్సు పథకం..? ఎక్కడ అన్నారు. ధరల స్థిరీకరణ కింద రైతులను ఆదుకునేందుకు రూ.300 కోట్లు ఎలా సరిపోతాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను దారుణంగా మోసం చేశారన్నారు. పిఆర్‌సి ప్రకటనలేదు.. ఐఆర్ ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 10 వేల నుంచి 12 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అప్పుడే రాయలసీమకు మేలు జరుగుతుందన్నారు. రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టులపై శీతకన్ను సరికాదన్నారు.

మానసిక రుగ్మతలను అధిగమించేలా వైద్యపరిజ్ఞానం

మానసిక వైద్యుల సంఘం జాతీయ అధ్యక్షురాలు డా॥సవిత మల్హోత్రా

సదస్సును ప్రారంభిస్తున్న మానసిక వైద్యుల సంఘం జాతీయ అధ్యక్షురాలు డా॥సవిత మల్హోత్రా, తదితరులు

ప్రజాశక్తి - అనంతపురం

మానసిక రుగ్మతలను అధిగమించేలా ప్రస్తుత వైద్య పరిజ్ఞానం అభివృద్ధి చెందడం శుభపరిణామం అని మానసిక వైద్యుల సంఘం జాతీయ అధ్యక్షురాలు డా॥సవిత మల్హోత్రా తెలిపారు. అనంతపురం నగరంలోని ఆర్ కన్వెన్షన్ సెంటర్లో రెండు రోజులపాటు జరిగే జాతీయస్థాయి మానసిక వైద్యుల నిరంతర వైద్య విద్య సదస్సు శనివారం ప్రారంభమైంది. అనంతపురం సైకియాట్రిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సదస్సుకు మానసిక వైద్యుల సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ సవిత మల్హోత్రా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి, ఢిల్లీ, ఉత్తర భారతదేశం నుంచి 300 మందికి పైగా మానసిక వైద్యులు హాజరయ్యారు. సదస్సులో మానసిక వైద్యంలో వచ్చిన అత్యాధునిక వైద్య చికిత్సలు, ఆధునిక వైద్య విద్యలు, మానసిక శాస్త్రంలో పరిశోధనలపై దేశంలోనే ప్రముఖ సైకియాట్రిస్టులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా డా॥మల్హోత్రా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మానసిక రుగ్మతలను అధిగమించేందుకు వైద్య పరిజ్ఞానం ఎంతో అభివద్ధి చెందిందన్నారు. మానసిక ప్రశాంతత పొందటానికి వైద్యరంగంలో అనేక కొత్త అంశాలు ముందుకు వచ్చాయన్నారు. ఈ సంవత్సరం అత్యుత్తమ మానసిక వైద్యుల సంఘం విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జాతీయ పురస్కారం రావడానికి అనంత జిల్లాలో అనంతపురం సైకియాట్రిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఇండ్లూరి ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన, ప్రపంచ ఆత్మహత్యల నివారణ సదస్సులు, ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాలు, నిరంతర వైద్య విద్యా సదస్సులు, వివిధ వైద్య కళాశాలలకు స్వయంగా వెళ్లి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లాంటి అంశాలు దోహద పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సైకియాట్రిస్టులు డా॥టిపి.సుధాకర్, డా॥.ఎన్‌వి.రమణారావు, డా॥జగదీష్, డా॥.రఘురాం, డా॥.వికాస్ మీనన్, డా॥.రాజశేఖర్, డా॥.చంద్రశేఖర్, డా॥.జివిఎస్.మూర్తి, డా॥లోకేశ్వర్ రెడ్డి, డా॥శరత్చంద్ర, డా॥రాధికా రెడ్డి, విశిష్ట అతిథులుగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డా॥ఎస్.మాణిక్యరావు, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపర్ ఇంటెండెంట్ డా॥కెఎస్ఎస్.వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

రైతుసంఘం ఆధ్వర్యంలో 7 నుంచి పాదయాత్ర-10న కలెక్టరేట్ ముందు ధర్నా-పోస్టరు విడుదల

పోస్టర్లను విడుదల చేస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులు సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు 2024-25 ఖరీఫ్, రబీ సీజన్లలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు విరూపాక్షి ఆధ్వర్యంలో శనివారం ఉరవకొండలోని రెవెన్యూ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2024-25 ఖరీఫ్, రబీలో సాగు చేసిన మిరప, పత్తి, సీడ్ జొన్న, పప్పుశనగ పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అప్పుల పాలయ్యారన్నారు.

మిరప పంటను క్వింటా రూ.50వేలతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర రూ.11780 రైతులకు గిట్టుబాటయ్యే పరిస్థితి లేదన్నారు. ఓ వైపు పంట పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతుంటే.. మరోవైపు ధర భారీగా తగ్గిపోతోందన్నారు. రెండు సంవత్సరాలుగా ఏసీ గోడౌన్లలో నిల్వ చేసుకున్న బాడుగలను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. అలాగే రబీసీజన్‌లో సుమారు 57 వేల హెక్టార్లలో పప్పుశెనగ పంట సాగు చేయగా అతివృష్టి, అనావృష్టి కారణంగా పూర్తిగా దెబ్బతిందన్నారు. జిల్లాలోని పెద్దవడుగూరు, యాడికి, పామిడి, తాడిపత్రి ప్రాంతాల్లో పెద్దఎత్తున రైతులు నిల్వ చేసుకున్నారన్నారు. కావున ప్రభుత్వం ఎకరాకు రూ.20వేలు పంట నష్టపరిహారం ఇచ్చి, మద్దతు ధర క్వింటాకూ 10వేలు ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు. అలాగే విడపనకల్ మండలంలో హావళిగి, పాల్తూరు, తదితర గ్రామాల్లో సీడ్ జొన్న 30ఏళ్లు సంవత్సరాలుగా సాగు చేస్తున్నారన్నారు. దళారుల నుంచి సీడ్ జొన్న రైతులను కాపాడి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఇకపోతే మిరప, పత్తి, పప్పుశనగ పండించిన కౌలు రైతులు పంటలను అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించి కౌలురైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 2024-25 ఖరీఫ్, రబీలో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం, బీమా ప్రకటించాలని, మిర్చి రైతులకు ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని, సీడ్ జొన్నకు క్వింటా రూ.5వేల మద్దతు ధర ప్రకటించాలని, కంపెనీలు, దళారులు లేకుండా రైతులతో నేరుగా కొనేవిధంగా చర్యలు తీసుకోవాలని, పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రూ.10వేలతో కొనుగోలు చేయాలని, షరతులు లేకుండా క్వింటా పత్తి రూ.10వేలతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల మార్చి 7న ఉరవకొండ నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. పాదయాత్ర ఈనెల 10వ తేదీ అనంతపురంలోని కలెక్టరేట్‌కు చేకుంటుందన్నారు. అక్కడ నిర్వహించనున్న ధర్నాలో రైతులు పెద్ద ఎత్తులన పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం అధ్యక్షులు రంగారెడ్డి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్, సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు, రైతుసంఘం నాయకులు సీనప్ప, మురళి, సిద్ధప్ప, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం

నియోజకవర్గ పరిధిలోని చంద్రబాబునగర్ కాలనీలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రారంభించారు. గతంలో నగర్‌వాసులు తమకు వాటర్ ప్లాంట్ కావాలని విజ్ఞప్తి చేయగా స్పందించిన ఎమ్మెల్యే సొంత నిధులతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. అనంతరం టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, నారా ట్రస్టు వ్యవస్థాపకులు ఖాసీంతో కలిసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. వాటర్‌ప్లాంట్ నిర్వహణ బాధ్యతను రుద్రంపేట పంచాయతీ టిడిపి అధ్యక్షుడు ఎస్ఎం బాషాకు అప్పజెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సైఫుద్దీన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

761 మంది గైర్హాజరు

- మొదటి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం
- కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు కావడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం పరీక్ష కేంద్రాలకు తరలివచ్చారు. ఎక్కడ ఆలస్యం అవుతుందోనని విద్యార్థులు పరుగు పరుగున పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 63 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పరీక్షలకు సంబంధించి జనరల్ విద్యార్థులు 24,068 గాను 23,443 మంది హాజరు కాగా 625 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,360 గాను 2,224 హాజరయ్యారు. 136 మంది గైర్హాజరయినట్లు పరీక్షల కన్వీనర్, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వెంకటరమణ నాయక్ తెలిపారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు విద్యార్థులను 8.30 గంటల తర్వాత కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ తదితర వస్తువులను అనుమతించలేదు. పరీక్షలు జరిగే సమయంలో పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ కేంద్రాలు, ప్రింటింగ్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను బంద్ చేయించారు.

పారదర్శకంగా పింఛన్ల పంపిణీ

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

జిల్లా వ్యాప్తంగా సామాజిక భద్రత పింఛన్లను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. శనివారం మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఎన్టీఆర్ భరోసా పథకం కింద నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పింఛన్‌దారులతో మాట్లాడారు. గ్రామంలో ఎన్ఆర్ఈజిఎస్ కింద లబ్ధిదారురాలు వెంకట లక్ష్మమ్మ ఇంటి వద్ద వ్యక్తిగత ఇంకుడు గుంతకు కలెక్టర్ భూమి పూజ చేశారు. త్వరగా ఇంకుడు గుంతను పూర్తి చేయాలని సూచించారు. తదనంతరం గ్రామంలో సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్‌ను తనిఖీ చేసి, వర్మీ కంపోస్ట్ తయారు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. క్లాత్ మిత్రులకు జీతాలు ఇవ్వాలని, వారికి అవసరమైన జాకెట్, గ్లౌజులు సరిపడా ఇచ్చారా లేదా అనేది నివేదిక ద్వారా అందించాలని డ్వామా పీడీని ఆదేశించారు. ఆ తర్వాత గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఎన్‌హెచ్ 544డి జాతీయ రహదారికి సంబంధించి భూసేకరణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, డ్వామా పీడీ సలీం బాషా, హార్టికల్చర్ డిడి నరసింహారావు, తహశీల్దార్ రజాక్ వలి, ఎంపిడిఒ ఫజిల్ బాషా, సర్పంచి యుగంధర్, ఈవోఆర్డీ వెంకటేష్, అటవీ అధికారి దీన, ఎపిఒ ఆదినారాయణమ్మ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపిపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

తెలిసీ తెలియని వైద్యం చేసి నిండు ప్రాణాలను బలి తీసుకున్న రాయదుర్గానికి చెందిన ఆర్‌ఎంపి వైద్యుడు చెన్నవీరపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మృతిచెందిన విజయ్ మృతదేహాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు. అనంతరం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ వైద్యశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ ఆర్‌ఎంపి డాక్టర్ చన్నవీరా బయటేమో ఫిజియోథెరపీ క్లినిక్ అని పేరు పెట్టుకుని లోపల మాత్రం అన్నిరకాల వైద్యం చేయడం ఎంత మేరకు సమంజసమని ప్రశ్నించారు. తాను చేయాల్సిన వైద్యాన్ని పక్కనపెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ అన్నిరకాల వైద్యం చేస్తూ నిండు ప్రాణాన్ని బలి తీసుకోవడం బాధాకరమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మృతుని కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాయదుర్గంలో ఆర్‌ఎంపి డాక్టర్లు విచ్చలవిడిగా వైద్య సేవలు అందిస్తూ జిల్లా వైద్యాధికారులు అనేకసార్లు కేవలం ప్రథమ చికిత్సలు మాత్రమే చేయాలని వారికి సూచించినా పట్టించుకోవడం లేదన్నారు. గతంలో ఇదే డాక్టర్‌పై అనేక ఆరోపణలు వచ్చాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆర్‌ఎంపి వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు తిమ్మరాజు, మధు, రమేష్, శంకర్, రవి, నాగ, అంజి, ఉమేష్, సూరి, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాము, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాతూరులో తాగునీటి సరఫరా బంద్

పైపులైను లీకేజీ.. ప్రజలకు ఇబ్బందులు

నడిరోడ్డుపై జెసిబితో పైప్‌లైన్ పనులు చేస్తున్న వాటర్ వర్క్స్ సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని పాతూరుకు శుక్రవారం సాయంకాలం నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. తిలక్ రోడ్డులోని పోస్టాఫీస్ సమీపంలో 12 ఇంచుల మెయిన్ పైప్‌లైన్ లీకేజీ ఏర్పడటంతో ప్రధాన రహదారి బురదమయంగా మారింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం ఉదయం 10 గంటల సమయంలో జెసిబిని వినియోగించి లీకేజీ ప్రాంతాన్ని తవ్వడం పనులు చేపట్టారు. ఓవైపు తవ్వకం పనులు జరుగుతుంటే.. మరోవైపు నిరంతరాయంగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో ఎటువైపు నుంచి ఏ వాహనం వస్తుందో అని వాటర్ వర్క్స్ సిబ్బంది భయంతో పని చేయాల్సి వస్తోంది. దీనికితోడు మున్సిపల్ కార్పొరేషన్‌లో మరమ్మతులకు అవసరమైన సామగ్రి స్టాకు లేకపోవడం కూడా మరమ్మతులకు ఇబ్బందులు కలిగించే అంశం. గతంలో అవసరమైన సామగ్రిని ప్రత్యేకంగా వాటర్ వర్క్స్‌కు తెప్పించి నిల్వ చేసుకునే వారు అయితే గత కొన్ని ఏళ్లుగా ఆ సంప్రదాయానికి స్వస్తి పలికారు. లీకేజీలు ఏర్పడితే పైపులైన్ మరమ్మతులకు కాంట్రాక్టర్లపై ఆధారపడి పనులు చేసే పరిస్థితి నెలకొంది అని సిబ్బంది వాపోయారు. వీలైనంత త్వరగా లీకేజీ పైపులైను మరమ్మతులు పూర్తి చేస్తే కానీ పాతూరు ప్రాంతానికి తాగునీటి సరఫరా పునరుద్ధరించే అవకాశాలు లేవు.

కార్పొరేషన్ ఎస్ఇ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్ నూతన సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా చంద్రశేఖర్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. దీంతో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో తాను మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహించినందున అందరినీ కలుపుకుని వెళ్తా ముందుకు సాగుతామని తెలిపారు. సిబ్బంది సహకారంతో కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కాంట్రాక్టర్లు సైతం అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. ఎట్టివేళ అందరికీ అందుబాటులో ఉంటే పని చేస్తామన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్

కూలీలకు నీడ, నీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పుట్లూరు

ఉపాధి హామీ పథకం కింద పనులకు వెళ్లే కూలీలకు నీడ, నీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలన్నారు. అలాగే రోజుకు రూ.600 కూలి పడేలా చూడాలన్నారు. పని చేసే చోట మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్దయ్య, నాయకులు బి.భాస్కర్‌రెడ్డి, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం పకడ్బందీ గా అమలు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా మల్టీమెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లను పకడ్బందీగా తనిఖీ చేయాలన్నారు. అలాగే టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని, గర్భస్థ పిండ లింగం నిర్ధారణ నిషేధిత చట్టం, స్కాన్ సెంటర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు లింగ నిర్ధారణ చేసినట్లయితే సమాచారాన్ని ఈ టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ప్రజలు తెలియజేయాలని సూచించాలన్నారు. ముఖ్యంగా చట్టంపై ప్రజలకు వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ఆడపిల్లల ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరపకూడదని, చట్టం అతిక్రమిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇ.బి.దేవి, ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు డాక్టర్ దుర్గేష్, జిల్లా ట్రైనింగ్ సెంటర్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం.సూర్యనారాయణరెడ్డి, ఐ అండ్ పీఆర్ డిపిఆర్ఓ గురుమూర్తి శెట్టి, డెమో త్యాగరాజ్ పాల్గొన్నారు.

పోలీస్ కమాండ్ కంట్రోల్ భవన సముదాయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనంతపురం పోలీస్ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించ తలపెట్టిన పోలీస్ కమాండ్ కంట్రోల్ నూతన భవన సముదాయ నిర్మాణానికి రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శనివారం భూమిపూజ చేశారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ పి.జగదీష్ పర్యవేక్షణలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. ప్రీ ప్రైమరీ పోలీస్ రక్షక్ స్కూల్‌ను సందర్శించి అక్కడ విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారులతో ముచ్చటించారు. సిపిసి క్యాంటీన్‌కు వెళ్లి సబ్సిడీ ధరలతో ఏపి సరుకులు అందుబాటులో ఉంచారు.. సబ్సిడీ ధరల ద్వారా పోలీసు కుటుంబాలకు ఎంత లబ్ధి చేకూరుతుందో ప్రత్యక్షంగా వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై హోంమంత్రి, డిజిపిలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ పి.జగదీష్, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె.పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎమ్మెస్.రాజు, పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, అదనపు ఎస్పీలు డివి.రమణమూర్తి, ఇలియాజ్ బాషా, ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, అనంతపురం అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'పల్లె' ఇంటికి హోంమంత్రి

హోంమంత్రితో పల్లె కుటుంబం

అనంతపురం రూరల్ : అనంతపురం నగర శివారు ప్రాంతంలోని ఆలమూరు రోడ్డులో ఉన్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి నివాసానికి హోంమంత్రి వంగలపూడి అనిత శనివారం విచ్చేశారు. ఈ సందర్భంగా పల్లెతోపాటు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పివికెకె ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణకిషోర్ దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశులుకు డాక్టరేట్

కళ్యాణదుర్గం రూరల్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ (ఎంబిఎ) విభాగ పరిశోధకుడు ఎం.వెంకటేశులు డాక్టరేట్ పొందారు. కంబదూరు మండలం పి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన వెంకటేశులు 'అసెస్‌మెంట్ ఆఫ్ మార్కెటింగ్ ఛాలెంజెస్ కాన్ఫ్రాంటెడ్ బై ఫార్మాస్యూటికల్ కంపెనీస్ ఇన్ ఇండియా' అన్న సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు. ఈ పరిశోధనకు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగ ఆచార్యులు పి.రఘునాథరెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరించారు. అంతేగాకుండా ఈయన రాసిన పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

'ఉపాధి'పై సామాజిక తనిఖీ

ఆత్మకూరు : 2023-24 ఏడాదిలో జరిగిన ఉపాధి హామీ పనులపై స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట ఉపాధి పనులపై సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సిఆర్‌పిలు తమ నివేదికలను చదివి వినిపించారు. నివేదికల ఆధారంగా సిబ్బందికి రూ.32,444 రికవరీ, ఉపాధి హామీ సిబ్బందికి రూ.41వేలు ఫైన్ రాశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారిణి శశికళ, జిల్లా విజిలెన్స్ అదనపు అధికారి పర్వేజ్, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ చెన్నకేశవులు, ఎంపిపి హేమలత, ఎంపిడిఒ లక్ష్మీనరసింహ, ఎపిఒ సుజాత, ఇసి భాస్కర్ పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో పి-4 సర్వే : కలెక్టర్

ప్రజాశక్తి తాడిపత్రి

క్షేత్రస్థాయిలో పీ - 4 సర్వేను నాణ్యతగా చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం తాడిపత్రి పురపాలక సంఘంలోని 20వ వార్డు క్రిష్ణాపురం-2 సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పి-4 సర్వేని పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. మిస్సింగ్ సిటిజన్, చైల్డ్ విత్‌అవుట్ ఆధార్, తదితర సర్వేకు సంబంధించి ప్రజలు అందుబాటులో లేకపోవడంపై సచివాలయ సిబ్బందితో ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పి-4 సర్వే, జిఎస్‌డబ్ల్యుఎస్‌లో భాగంగా మిస్సింగ్ సిటిజన్, చైల్డ్ విత్‌అవుట్ ఆధార్ తదితర అంశాలపై సర్వే తూతూమంత్రంగా చేయరాదన్నారు.

తాడిపత్రి మున్సిపాలిటీ కార్యాలయం తనిఖీ

తాడిపత్రి మున్సిపల్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో తాగునీరు ఎలా వస్తోందని కౌన్సిలర్లతో జిల్లా కలెక్టర్ ఆరా తీయగా, వేసవి సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారన్నారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, తహశీల్దార్ రజాక్ వలి, ఎంపిడిఒ ఫజిల్ బాషా, ఈవోఆర్డీ వెంకటేష్, ఎపిఒ ఆదినారాయణమ్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో పి-4 సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

దేశానికి ఉపయోగపడేలా ఆలోచనలు ఉండాలి

మాజీ ఐఎఎస్ అధికారి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి విద్యార్థి దేశానికి ఉపయోగపడేలా ఆలోచించి గొప్పస్థాయిలో నిలవాలని మాజీ ఐఎఎస్ అధికారి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఎస్‌కెయు సమీపంలో ఉన్న అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల 17వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశంలో గొప్ప పేరు తెచ్చుకున్న ఎపి వాటర్ అడ్వైజర్ కన్నయ్యనాయుడు.. ఒక సాధారణ రైతు నుంచి గొప్ప విద్యావేత్తగా.. విద్యాదాతగా ఎదిగిన అనంత రాముడుతో వేదిక పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. భావిభారత ఇంజనీర్లు కన్నయ్యనాయుడు, అనంత రాముడు లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని గొప్ప స్థానాలను పొందాలని ఆకాంక్షించారు. వేలాది మంది రైతుల కష్టాలు, లక్షలాది ఎకరాల వ్యవసాయ భూములను కాపాడిన ఘనత కన్నయ్యకు దక్కుతుందన్నారు. తుంగభద్ర లాంటి అతిపెద్ద డ్యాం దెబ్బతిన్న తరుణంలో కన్నయ్య భుజాన వేసుకుని వ్యవహరించిన తీరు గొప్పదన్నారు. కన్నయ్య నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో పునాది లాంటివారన్నారు. దేశ భవిష్యత్తును గుర్తించి ముందుకు నడవాలని తెలిపారు. ఇదే వేదికగా అనంతలక్ష్మి ఛైర్మన్ అనంత రాముడు పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో భారీ ఎత్తున రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య, కళాశాల డైరెక్టర్ రమేష్ నాయుడు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఐఎఎస్ అధికారి లక్ష్మీనారాయణ

అమరవీరులకు నివాళి

గుత్తి : పట్టణంలోని గాంధీ కూడలిలో ఉన్న రిక్షాస్టాండ్‌లో ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు ఎన్.ఈరన్న ఆధ్వర్యంలో శనివారం మాదిగ అమరవీరుల సంస్కరణ సభ నిర్వహించారు. ఇందులో భాగంగా అమరవీరుల చిత్రపటాలకు నాయకులు పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు నగదని సత్య, ఎన్.నాగేష్, నాగేంద్ర, రామాంజనేయులు, అయ్యప్ప, లక్ష్మన్న, లక్ష్మీనారాయణ, ఎస్.రాజా, ప్రసాద్, సుంకన్న, ఉసేనప్ప, సుధాకర్, రంగా, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

గుత్తి : మండలంలోని బేతాపల్లి గ్రామంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో దాత సమకూర్చిన విద్యాసామగ్రిని విద్యార్థులకు అందజేశారు. పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుని మహాలక్ష్మి ఆధ్వర్యంలో సరస్వతి పూజ చేశారు. ఈ సందర్భంగా గుత్తి నివాసి అయినా పంచాయతీ ఉద్యోగి టి.ఓబులేసు జన్మదినాన్ని పురస్కరించుకుని పదవ తరగతి చదువుతున్న 36 మంది విద్యార్థులకు పరీక్షలు సంబంధించిన సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సులోచన, శివప్రసాద్, నిరుపమ, సుజాత, రామకృష్ణయ్య, రత్నకుమారి, మాదన్న, తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

అనంతపురం రూరల్ : పలువురు బాధితులకు మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు మంచి మనసున్న మనిషి అన్నారు. ఇందులో భాగంగానే బాధితులు దరఖాస్తు చేసుకున్న వెంటనే సిఎంఆర్‌ఎఫ్ కింద నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు రమేష్, చేపల హరి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే తనిఖీ

యాడికి : మండల పరిధిలోని కోన ఉప్పలపాడు, ఓబుళాపురం గ్రామాల్లో చేపట్టిన ఇంటింటి సర్వేను తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ప్రజలకు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలపై అవగాహన కల్పించారు. తర్వాత చేశారు. గ్రామంలోని యూనివర్సల్ ఇనైజేషన్ వర్కను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం రాజామణి, ఆశా కార్యకర్త సుజాత పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ డే వేడుకలు

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో ఎజిఎం సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు ప్రీ ప్రైమరీ స్పోర్ట్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫిలిప్‌కుమార్, డీన్ తిప్పారెడ్డి, ప్రైమరీ ఇన్‌ఛార్జి లీలావతి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి హేమలత, పిఇటి అశోక్, హరి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

బొమ్మనహాల్ : మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఆర్డీటీ సంస్థ సహకారంతో శనివారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజకుమార మాట్లాడుతూ దాదాపు 63 మంది విద్యార్థులకు ఆర్డీటీ సంస్థ సైకిళ్లు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. అంతేగాకుండా విద్యాభివృద్ధికి ఆర్డీటీ కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కనేకల్ వెంకటేశులు, ఎటిఎల్ రీజినల్ డైరెక్టర్ కృష్ణవేణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హిమోగ్లోబిన్ పరీక్షలు

అనంతపురం : జీవసాంకేతిక శాస్త్రం ఆధ్వర్యంలో నగరంలోని ఎస్‌వి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శనివారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి తగ్గుదలను అరికట్టవచ్చన్నారు. విద్యార్థులు రోజూ సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా రక్తంలో ప్రోటీన్ స్థాయి పెరిగి శరీరానికి కావాల్సిన ఆక్సిజన్‌ను సరఫరా చేస్తుందన్నారు. అనంతరం దాదాపు 5వేల మందికిపైగా హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌ఎవి.ప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనాథ్, జీవసాంకేతిక శాస్త్రం అధ్యాపకులు ఎస్.రిజ్వానాబేగం, టి.సుదర్శన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బెలుగుప్ప : వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రానికి చెందిన యూనియన్ ఆటో డ్రైవర్లు శనివారం స్థానిక బస్‌షెల్టర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ శివ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉండటంతో వచ్చిపోయే ప్రయాణికులకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి దాహార్తి తీర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామం అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం

ఎపి శిల్పారామం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్వామినాయుడు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంత పురం శిల్పారామం మరింత అభివృద్ధి చేసేందుకు సమిష్టి కృషి అవసరమని ఆంధ్రప్రదేశ్ శిల్పారామం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్వామినాయుడు అన్నారు. శనివారం స్థానిక శిల్పారామాన్ని సందర్శించిన ఆయన ఉద్యోగులు, సిబ్బందితో పలు విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమిష్టి కృషితో సమస్యలను అధిగమించి శిల్పారామాన్ని అభివృద్ధి చేయడంతోపాటు ప్రజలను ఆకర్షించే సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టేందుకు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. తర్వాత శిల్పారామంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ప్రతి ఆదివారం సాయంత్రం క్రమం తప్పకుండా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని ఎఒ కృష్ణప్రసాద్ తెలిపారు. ఇంకా మరిన్ని అభివద్ధి పనులు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎపి శిల్పారామం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్వామినాయుడు

తరగతుల విలీనంపై ఏకగ్రీవ తీర్మానం

ఉరవకొండ : వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో 3, 4, 5వ తరగతుల విలీనంపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను పున:ప్రారంభించాలని తల్లిదండ్రులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మల్లెల జగదీష్, పాఠశాల ఎస్‌ఎంసి ఛైర్మన్ పూసల నరేష్, ఉపాధ్యాయులు శ్రీధర్, ఎస్‌ఎంసి కమిటీ సభ్యులు కేశన్న, నిమ్మగంటి వన్నూరుస్వామి, రామతులసి, శ్రీనివాసులు, కృష్ణ, బైనే ఈశ్వర్ పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులపై కేసులను తొలగించండి

ఉరవకొండ : జిల్లాలో ఎలాంటి విచారణ జరపకుండా అన్యాయంగా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులపై నమోదు చేసిన కేసులను తొలగించాలని ఎపి మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు శనివారం అనంతపురంలోని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు స్వగృహంలో ఎపి మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భక్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో హోంమంత్రి వంగలపూడి అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పని చేస్తున్న కొందరు ఉద్యోగులను అకారణంగా పోలీసులు వేధిస్తున్నారన్నారు. ఎలాంటి తప్పులు చేయకపోయినా సమాజంలో వారి పరువు, ప్రతిష్టలను భంగం కలిగించే విధంగా పోలీసులు తీసుకుంటున్న చర్యలను హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కావున వెంటనే స్పందించి తమపై నమోదైన కేసులను తొలగించాలని కోరారు.

బీసీ హాస్టల్ తనిఖీ

పుట్లూరు : మండల కేంద్రంలోని బిసి వెల్ఫేర్ హాస్టల్‌ను మండల ప్రత్యేకాధికారి ఆంజనేయులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించి స్టాక్ వివరాలను స్థానిక హాస్టల్ వార్డెన్ శివారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇడ్లీ తయారీలో ప్లాస్టిక్ కవర్‌ను వినియోగించడం గమనించి వాడొద్దని వార్డెన్‌ను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను కూడా హాస్టల్‌లోనే చదువుకుని జిల్లా అధికారి స్థాయికి ఎదిగానన్నారు. మీరు కూడా కష్టపడి చదవాలని సూచించారు.

పాస్ పుస్తకం మంజూరుపై విచారణ

గుత్తి : మండలంలోని ధర్మాపురం గ్రామంలో ఓ రైతు పేరిట మంజూరైన పట్టాదారు పాసు పుస్తకంపై డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ శనివారం విచారణ చేపట్టారు. గతంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో భాగంగా ధర్మాపురం గ్రామంలో ఈఏడాది జనవరి 7న కార్యక్రమానికి హాజరైన సంయుక్త కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మకు గ్రామానికి చెందిన పులికొండ అనే రైతు 3.26 ఎకరాల భూమిని తన సోదరుడు రామాంజనేయులు అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకం చేయించుకున్నాడని వినతిపత్రం ఇచ్చారు. దీంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కలెక్టర్ గుత్తి తహసిల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన పులికొండతో మాట్లాడుతూ తండ్రి నుంచి సంక్రమించిన ఆస్తి కావడంతో ఆ పట్టాదారు పాసు పుస్తకాన్ని రద్దు చేయడానికి వీలుకాదన్నారు. అది భూమి పెద్దల ఆస్తి కాబట్టి సివిల్ న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. రస్తా సమస్య ఉంటే పరిష్కరించాలని తహశీల్దార్ డి.ఓబిలేసుకు చెప్పారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ రాజేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

కూలీలకు పని కల్పించకపోతే ఎలా..?

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపిడిఒ

పుట్లూరు : మండలంలోని కూలీలకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించకపోతే ఎలా..? అని ఎంపిడిఒ అలివేలమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పని కల్పించాలని ఎపిఒను నిలదీసిన కూలీ అంటూ శనివారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎంపిడిఒ మండల ఉపాధి ఎపిఒ, ఇసి, టిఎలను పిలిచి మందలించారు. అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఉన్నతాధికారులు చెబుతున్నా ఎందుకు పనులు కల్పించడం లేదని ప్రశ్నించారు. పనులు కల్పించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని సూచించారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరణకు చర్యలు

యల్లనూరు : తాడిపత్రి వయా యల్లనూరు, వెన్నపూసపల్లి గ్రామాల మీదుగా సింహాద్రిపురానికి అర్ధాంతరంగా నిలిపిన ఆర్టీసీ సర్వీసును పునరుద్ధరించనున్నట్లు అధికారులు తెలిపారు. సంబంధిత గ్రామాల మీదుగా నడిచే వైఎల్‌ఆర్ 3 ఆర్‌టిసి బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని శనివారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఆర్టీసీ అధికారులు వైఎల్‌ఆర్ 3 బస్సును పునరుద్ధరించడమే కాకుండా సర్వీసును నిరంతరాయంగా నడుతామని తెలిపారు.

అన్నేఫెర్రర్‌కు రామన్‌లుల్ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్‌డిటి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నేఫెర్రర్‌ని స్పెయిన్‌లోని బాలెరిక్ దీవుల ప్రభుత్వం శనివారం ప్రతిష్టాత్మకమైన రామన్ లుల్ అవార్డుతో సత్కరించింది. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక మార్పును తీసుకురావడంతో అన్నేఫెర్రర్ చేస్తున్న కృషిని కీర్తిస్తూ పాల్మాలో అవార్డును ప్రదానం చేశారు. ఆమెకు అరుదైన అవార్డు దక్కడంతో ఆర్‌డిటి సంస్థ యావత్ సిబ్బంది, జిల్లా ప్రజలు, ఆర్డీటీ సంస్థ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అవార్డు అందుకున్న అన్నేఫెర్రర్

చెత్త సంపద కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని తిరుమలాపురం, కోడుమూర్తి, చిలమకూరు గ్రామ పంచాయతీల్లో ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాలను ప్రత్యేక అధికారుల బృందం పరిశీలించింది. వీటితోపాటు పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యాడికి ఎంపిడిఒ వీరరాజు, ఇఒఆర్‌డి శశికళ, పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని ప్రత్యేకాధికారి జయకుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు అందిస్తే నాణ్యమైన దిగుబడిని తీస్తారన్నారు. రైతులు కూడా ఇక్కడ తయారయ్యే వర్మీకంపోస్టును వాడుకుని అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణ, ఇఒఆర్‌డి జయరాములు, పంచాయతీ సెక్రటరీ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు మండలంలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆశలు నెరవేరేనా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ బడ్జెట్‌లను ప్రవేశపెట్టాయి. ఈ రెండు బడ్జెట్‌లు పరిశీలిస్తే దేశంలోనే అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాకు ఏ మేరకు ప్రాధాన్యతనిచ్చాయన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. అదే కరువు, అదే వలసలు ఇప్పటికీ ఇక్కడ కొనసాగుతూనే ఉన్నాయి. వర్షం పడితే పంటలు లేకపోతే కరువు అన్నట్టుగా ఉంటోంది. ఇప్పటికే 70 శాతానికిపైగా వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేసుకునే పరిస్థితులున్నాయి. రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన అనంతపురం జిల్లా వంటి వాటికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్న హామీని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. 2025-26 కేంద్ర బడ్జెట్‌లోనూ మొండి చేయి చూపింది. కనీసం కేంద్రీయ విశ్వవిద్యాలయంకు రెండేళ్లుగా ఒక్క పైసా నిధులు విడుదల చేయకపోవడం గమనార్హం. ఇప్పుడు జరుగుతున్న విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాల్లేక విద్యార్థినులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ అన్ని రకాల సౌకర్యాలతో ఎప్పుడు పూర్తి చేస్తారన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఇక రాష్ట్ర బడ్జెట్‌లోనైనా జిల్లాకు దిశా నిర్దేశం చేస్తుందా అని చూస్తే అదీ లేకుండాపోయింది. అయితే గుడ్డిలో మెల్లలగా హంద్రీనీవాకు నిధుల కేటాయింపుల్లో కొంత ప్రాధాన్యతనిచ్చింది. ఇందులో వినియోగంపై కొంత సందేహాలున్నాయి. రెండో దశలో లైనింగ్ వద్దని ఒకవైపు రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వాటిని పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాల్లేవు. ఇక జిల్లాకు నికర జలాలు అందించే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువను పూర్తిగా విస్మరించినట్టే కనిపిస్తోంది. ఆధునీకరణ ఊసే ఎత్తలేదు. ఇక గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ ఆధునీకరణ, మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ పనులు ఎక్కడివక్కడి ఆగిపోయి ఉన్నాయి. అంతేకాకుండా మిడ్‌పెన్నార్ డ్యామ్ మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. వీటికి నిధుల కేటాయింపులు పెద్దగా లేనట్టుగానే కనిపిస్తున్నాయి. ఇక పండిన పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా మిర్చి పంట పండుతుంది. ఈ పంటకు ధరలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా పప్పుశనగకు ధరలేదు. వీటిని ప్రభుత్వం కొనుగోలు చేస్తామని చెబుతున్నప్పటికీ కొనుగోలు చేసే సమయంలో అనేక షరతులు పెడుతోంది. వీటికి ఈ బడ్జెట్‌లో పెద్దగా కేటాయింపుల్లేవన్న విమర్శలున్నాయి. ఇలా ప్రధానమైన సమస్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కూడా వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఆశించిన కేటాయింపులు జరపలేదు. నిరాశపరిచేవిధంగా ఉందని విపక్షాలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఆడపిల్లలను రక్షించుకుందాం

ప్రజాశక్తి-నార్పల

ఆడపిల్లలను చదివించడమే కాకుండా రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిడిపిఒ భారతి పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని తిక్కస్వామి వీధి 1 అంగన్వాడీ కేంద్రంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లను రక్షించడం తల్లితండ్రులకే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆలోచించాలన్నారు. అనంతరం కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ భారతి, సూపర్‌వైజర్ సునాలిని, ప్రాజెక్టు కోఆర్డినేటర్ లావణ్య, అంగన్వాడీ కార్యకర్త స్వర్ణలత, తల్లులు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిడిపిఒ భారతి

'ఉపాధి' పనుల పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని తక్కళ్లపల్లి, ఎస్.గూడూరు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఎపిఒ నరేంద్ర శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా నీటినిల్వ కుంట పనులను చేస్తుండగా కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిఎలు, ఎఫ్‌ఎలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

టీ దుకాణాల్లో చోరీ

గుత్తి : పట్టణంలోని తండ్రి కుమారుడికి సంబంధించిన రెండు టీ దుకాణాల్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. స్థానిక స్టేట్ బ్యాంకు సమీపంలో ఉన్న దశరథరామిరెడ్డి, గాంధీ కూడలి సమీపంలో ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి అనే తండ్రి కుమారుడికి చెందిన టీస్టాళ్లలో గుర్తు తెలియని దుండగులు దుకాణాలకు వేసిన తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. క్యాష్‌బాక్స్‌లో ఉన్న దాదాపు రూ.10వేలు నగదు, రూ.20వేలు విలువజేసే సిగరెట్లు దోచుకెళ్లారు బాధితుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నాటు తుపాకులు స్వాధీనం

రాయదుర్గం : కణేకల్లు, ఉరవకొండ మండలాల మధ్య సొల్లాపురం గ్రామ పరిధిలోని పొలాల్లో శనివారం రెండు నాటు తుపాకీలు స్వాధీనం చేసుకున్నట్లు కణేకల్ ఎస్ఐ నాగమధు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు పొలాల్లో పడేసి ఉండగా ప్రజలు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి రెండు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎవరూ లైసెన్స్ లేకుండా ఆయుధాలు కలిగి ఉండటం నేరం అన్నారు. కావున తుపాకులు, పేలుడు పదార్థాలు లాంటివి ఇళ్లు, పొలాల్లో ఉంచుకోవద్దన్నారు. అలాగే వన్యప్రాణులను వేటాడటం నేరం అన్నారు.